https://teluguislam.net



# హిజ్రత్ చేసి మక్కాను వీడిన దైవప్రవక్త (స)

మహాప్రవక్త ముహమ్మద్ (స) హత్యకు తీర్మానం ఆమోదించబడినప్పుడు హజ్రత్ జిబ్రీల్(అ.స.), దైవవాణితో ఆయన (స) సన్నిధికి వచ్చారు. ఖురైష్ పన్నిన కుట్రను గురించి ఆయనకు తెలుపుతూ, అల్లాహ్ మిమ్మల్ని ఇక్కడి నుండి బయలుదేరి వెళ్ళడానికి అనుమతించాడని సూచిస్తూ, హిజ్రత్ చేసి వెళ్ళవలసిన ఆ తేదీని కూడా నిర్ణయించి చెప్పారు. ఆ రాత్రి ఆయన (స) రోజూ పడుకొనే చోట పడుకోవద్దని కూడా చెప్పడం జరిగింది.[1]

ఈ సూచన అందగానే మహాప్రవక్త (స), ఆ రోజే మిట్టమధ్యాహ్న సమయంలో అబూ బక్ర్ (ర) ఇంటికి వెళ్ళి, హిజ్రత్ చేయడానికి సంబంధించిన ప్రోగ్రామ్‌నంతా సిద్ధం చేసి ఉంచమని వివరించారు. మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇంటికి వచ్చిన విషయాన్ని హజ్రత్ ఆయిషా (ర) ఇలా ఉల్లేఖిస్తున్నారు:

"ఆ రోజు మధ్యాహ్నం మేము అబూ బక్ర్ (ర)గారి ఇంట్లో కూర్చొని ఉన్నాం. ఎవరో వచ్చి అబూ బక్ర్ (ర) నుద్దేశించి, మహాప్రవక్త (స)గారు తలపై గుడ్డ కప్పుకొని వస్తున్నారని చెప్పారు. మిట్టమధ్యాహ్న సమయంలో ఆయన ఎప్పుడూ రాలేదు. అబూ బక్ర్ (ర) లేచి, బయటకు వెళ్ళారు. మహాప్రవక్తా! తమరెప్పుడూ ఈ సమయంలో రాలేదే అని అడిగారు.

మహాప్రవక్త (స) లోనికి రావటానికి అనుమతి కోరారు. అనుమతి లభించగానే ఆయన ఇంట్లోకి ప్రవేశించి, "అబూ బక్ర్! ఇక్కడ ఉన్నవారిని ప్రక్కకు పొమ్మని చెప్పండి" అని అన్నారు. దానికి అబూ బక్ర్(ర) "దైవప్రవక్తా! ఇంకెవరూ లేరు, మీ సతీమణి తప్ప, చెప్పండి" అని బదులు పలికారు.

"నాకు హిజ్రత్ చేసి వెళ్ళే అనుమతి లభించింది" అన్నారు మహాప్రవక్త (సఅసం).

---

*1. ఇబ్నె హష్షామ్-1/482; జాదుల్ మఆద్-2/52.*

https://teluguislam.net



"మరి తమరి వెంట...(నేనుంటానా?)" అని అడిగారు.

ఔను అన్నారు దైవప్రవక్త (స).[2]

ఆ తరువాత హిజ్రత్ ప్రోగ్రామ్ నిర్ణయించి తన ఇంటికి వెళ్ళిపోయా రాయన (స). ఆ రాత్రి ఎప్పుడొస్తుందా అని నిరీక్షించసాగారు.

## దైవప్రవక్త (స) ఇంటిని చుట్టుముట్టిన ముష్కర మూక

ఇటు మక్కా ముష్రిక్ నాయకులు, పార్లమెంటు దారున్నద్వాలో ఉదయం ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని అమలుచేయడానికి రోజంతా కసరత్తు చేయడంలో నిమగ్నమై ఉన్నారు. దీని కోసం వారు పదకొండు మంది సర్దారుల్ని ఎన్నుకోవడం జరిగింది. వారి పేర్లు ఇవి:

1. అబూ జహల్ బిన్ హష్షామ్
2. హకమ్ బిన్ ఆస్
3. ఉక్బా బిన్ అబీ ముయీత్
4. నజ్ర్ బిన్ హారిస్
5. ఉమయ్యా బిన్ ఖల్ఫ్
6. జమ్ఆ బినుల్ అస్వద్
7. తుఅయిమా బిన్ అద్దీ
8. అబూ లహబ్
9. ఉబై బిన్ ఖల్ఫ్
10. నుబయా బినుల్ హుజ్జాజ్
11. అతని సోదరుడు మునబ్బా బినుల్ హుజ్జాజ్.[3]

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, రాత్రి బాగా ప్రొద్దుపోయిన తరువాత వీరు దైవప్రవక్త (స) గారి గుమ్మం దగ్గర పొంచి కూర్చున్నారు. ఆయన (స) నిద్రపోగానే ఆయనపై విరుచుకుపడే ఉద్దేశంతో.[4] వారికి, తమ కుట్ర ఫలిస్తుం దని పూర్తి నమ్మకంగా ఉంది. ఈ విశ్వాసంతో అబూ జహల్ ఎంతో గర్వ పడుతూ, ఎగతాళిగా తన చుట్టూ ఉన్నవారిని ఉద్దేశించి ఇలా చెప్పనారం భించాడు.

---

2. సహీ బుఖారి, ప్రవక్త (స) హిజ్రత్ అధ్యాయం-1/553
3. జాదుల్ ముఆద్-2/52.
4. ఇబ్నె హష్షామ్-1/482.

https://teluguislam.net



"మీరంతా అతని ధర్మంలో చేరి అతనికి విధేయత చూపితే అరేబియా మరియు అరబ్బేతర రాజ్యాలకు రాజులైపోతారంటున్నాడు ముహమ్మద్ (స). చనిపోయిన తరువాత తిరిగి లేపబడినప్పుడు జోర్డాన్ ఉద్యాన వనాల్లాంటి ఉద్యానవనాలు లభిస్తాయట మీకు. మీరే అలా చేయకపోతే ఆయన తరఫు నుండి జరిగే యుద్ధంలో మీరంతా హతులైపోతారట. మరణించిన తరువాత తిరిగి లేపబడతారట. మీ కోసం కాల్చిపారేసే నరకాగ్ని శిక్ష కూడా ఉందట."[5]

మొత్తానికి కుట్ర అమలుకు నడిరేయి తరువాతి ఝాము ఖరారు అయింది. వీరంతా మేల్కొని ఆ సమయం కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. కాని అల్లాహ్ తన కార్యాన్ని నెరవేర్చే శక్తిగలవాడు. భూమ్యాకాశాల పాలన ఆయన చేతుల్లోనే ఉంది. ఆయన తలచిందే చేస్తాడు. ఆయన రక్షించదలచు కున్నవాడికి వీసమెత్తు నష్టం కూడా జరగదు. ఆయన పట్టు నుండి ఇంకెవ్వడు తప్పించుకోనూ లేడు. కాబట్టి అల్లాహ్ ఈ సందర్భంలో తాను వేసిన ఎత్తును గురించి దైవప్రవక్త(స)ను సంబోధిస్తూ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిస్తున్నాడు:

وَإِذْ يَمْكُرُ بِكَ الَّذِينَ كَفَرُوا لِيُثْبِتُوكَ أَوْ يَقْتُلُوكَ أَوْ
يُخْرِجُوكَ ۚ وَيَمْكُرُونَ وَيَمْكُرُ اللَّهُ ۖ وَاللَّهُ خَيْرُ الْمَاكِرِينَ ۝

"ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకోదగ్గదే; అప్పుడు సత్యతిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చేయాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ ఉన్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ ఉన్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు." (8 : 30)

## మహాప్రవక్త (స) తమ ఇంటిని వదిలేయడం

ఎట్టకేలకు ఖురైషులు తమ ప్లానును అమలుచేసేందుకు చేసిన ప్రయత్నం అంతా బూడిదలో బోసిన పన్నీరు చందంగా తయారైంది. వారు తమ

---

5. ఇబ్నె హష్షామ్-1/483
6. హజర్ మౌత్ (దక్షిణ యమన్)లో తయారైన దుప్పటిని హజ్రమీ దుప్పటి అంటారు.

https://teluguislam.net



కార్యంలో అపజయాన్నే ఎదుర్కోవలసివచ్చింది. ఈ సున్నితమైన ఘడియలో దైవప్రవక్త (స) హజ్రత్ అలి (ర)ను లేపి, "నీవు నా ప్రక్కపై పడుకో. నా ఈ ఆకు పచ్చటి హజ్రమియ్[6] దుప్పటిని కప్పుకొని నిద్రపో. నీకు వారి వల్ల ఎలాంటి ప్రమాదం వాటిల్లబోదు" అని అన్నారు. మహాప్రవక్త (స) ఎప్పుడూ ఈ దుప్పటినే కప్పుకొని పడుకోవడం పరిపాటి.[7]

ఆ తరువాత మహాప్రవక్త (స) బయటకు వచ్చారు. బహుదైవారాధకుల మధ్య నుండి వెడుతూ ఓ పిడికెడు సన్నటి రాళ్ళు గల మట్టిని వారి తలలపై చల్లారు. అల్లాహ్ వారి చూపుల్ని ఆయన్ను (స) చూడకుండా చేశాడు. ఆ సమయంలో మహాప్రవక్త (స) ఈ ఖుర్ఆన్ ఆయత్‌ను పఠిస్తూ బయటకు వచ్చేశారు.

وَجَعَلْنَا مِنْ بَيْنِ اَيْدِيْهِمْ سَدًّا وَّمِنْ خَلْفِهِمْ
سَدًّا فَاَغْشَيْنٰهُمْ فَهُمْ لَا يُبْصِرُوْنَ

"వజఅల్‌నా మిమ్ బైని అయిదీహిం సద్దవ్‌ వమిన్ ఖల్ఫిహిమ్ సద్దన్ ఫ అగ్‌షైనా హు ఫహుం లాయుబ్సిరూన్." (36 : 9)

(అర్థం: మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరొక గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పి వేశాము, ఇక వారికి ఏమీ కనిపించదు.)

ఆ సమయంలో ఆ ముష్రిక్కుల తలపై ఆ మట్టి పడకుండా ఎవ్వడూ మిగలలేదు. ఆ తరువాత ప్రవక్తశ్రీ(స), హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇంటికి వెళ్ళి పోయారు.

ఆ తరువాత ఆయన ఇంటి కిటికీలో నుండి బయటపడి ఆ ఇద్దరు యమన్ వైపు బయలుదేరారు. ఆ రాత్రికి రాత్రే మక్కాకు కొన్ని మైళ్ళ దూరాన ఉన్న 'సౌర్' అనే కొండ గుహ ఒకదానిలోనికి వచ్చి చేరారు.[8]

ఇటు ఇంటిని చుట్టుముట్టిన ముష్కర మూక ఆ సమయం కోసం ఎదురు చూస్తూనే ఉంది. అంతలోనే ఓ వ్యక్తి ఎవరో వచ్చి మీరందరు ఎవరి కోసం ఎదురు చూస్తున్నారిక్కడ? అని అడగ్గా, ముహమ్మద్ కోసం కాచుకొని కూర్చున్నామని బదులిచ్చారు వారు. అది విన్న అతడు, "మీరు మీ ప్రయ

7. ఇబ్నె హష్షామ్-1/482, 483.
8. ఇబ్నె హష్షామ్-1/483; జాదుల్ ముఆద్-2/52.

https://teluguislam.net



త్నంలో విఫలమైపోయారు. దైవసాక్షి! ముహమ్మద్ ఇందాకనే కదా మీ ముందు నుండే మీ తలలపై మట్టి పోస్తూ వెళ్ళిపోయింది" అని అన్నాడు.

"మేమాయన్ను చూడలేదే!" అని అంటూ తమ తలలపై పడివున్న మట్టిని దులుపుకున్నారు.

అయినా తలుపు సందులో నుండి తొంగి చూడగా అక్కడ హజ్రత్ అలి(ర) నిద్రపోతూ కనిపించారు. ఆయన్ను చూడగానే అడిగో ముహమ్మద్! నిద్రపోతున్నాడు అని అనుకోనారంభించారు. హజ్రత్ అలి(ర) ఒంటిపై ప్రవక్త (స) దుప్పటి వారికి కనబడింది. అందుకని వారు తెల్లవారిందాకా అక్కడనే తిష్ఠవేసుకొని కూర్చున్నారు. పూర్తిగా తెల్లవారిపోయింది. హజ్రత్ అలి(ర) ప్రక్క మీది నుండి లేవగానే ముష్రిక్‌లకు ఏం చేయాలో తోచలేదు. వారు ఆయన్ను నిలదీసి, "ముహమ్మద్ (స) ఎక్కడ?" అని అడిగారు. సమాధానంగా, "నాకేమీ తెలియదు" అని అన్నారు హజ్రత్ అలి (ర).[9]

## ఇంటి నుండి గుహ వరకు

మహాప్రవక్త (స) దైవదౌత్య శకం 14, సఫర్ మాసం 27వ తేది (క్రీ.శ. 12 మరియు 13 సెప్టెంబర్ 622)[10] మధ్యరాత్రి తన ఇంటి నుండి బయలు దేరుతూ తన ధన ప్రాణాల విషయంలో అందరికంటే నమ్మకస్తుడైన మిత్రుడు హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి ఇంటికి వచ్చారు. అక్కడ నుండి ఇంటి వెనుక భాగంలో ఉన్న ఓ కిటికీ నుండి బయటపడి, తెల్లారకమునుపే మక్కా దరి దాపుల్లో నుండి బయటపడేందుకు బయలుదేరారు.

ఖురైషులు తమ పూర్తి శక్తియుక్తులనుపయోగించి ఆయన్ను వెదక డానికి ప్రయత్నిస్తారన్న సంగతి మహాప్రవక్త (స)కు బాగా తెలుసు. వారు ఏ

---

*9. ఇబ్నె హిషామ్-1/483; జాదుల్ ముఆద్-2/52.*

*10. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/95. సఫర్, ఈ మాసం 14వ దైవదౌత్య శకం ముహర్రం నెల ప్రారంభం నుండి లెక్కకట్టినప్పుడు వస్తుంది. శక ప్రారంభం దైవ దౌత్యం నుండి లెక్కకడితే ఈ సఫర్ నెల 13వ దైవదౌత్య శకానికి చెందినదవు తుంది. సాధారణ సీరత్ చరిత్రకారులు మొదటి లెక్కనే అవలంబిస్తారు. కొందరు రెండవ లెక్కను పరిగణనలోనికి తీసుకుంటారు. ఈ కారణంగా ఈ సంఘటన తేదీని నిర్ణయించడంలో పొరపాటు జరుగుతోంది. మేము మాత్రం శకారంభాన్ని ముహర్రం నెల నుండే ప్రారంభించాం.*

https://teluguislam.net



మార్గంపైనైతే బయలుదేరబోతారో అది మదీనా మార్గమై అయి ఉంటుంది. అది మక్కాకు ఉత్తరం వైపునకు పోయే మార్గం. ఇది తెలిసిన మహాప్రవక్త (స) దానికి పూర్తిగా భిన్నమైన దిశ అంటే యమన్‌కు పోయే దక్షిణ దిశను ఎన్నుకొని దాదాపు అయిదు మైళ్ళు ప్రయాణించి 'సౌర్' అనే పర్వత సానువుల్లోకి చేరు కున్నారు. ఇది చాలా ఎత్తయిన కొండ. ఎక్కడం కూడా చాలా కష్టంతో కూడు కున్నది. మార్గంలో రాళ్ళు కూడా అధికంగా ఉండడం వలన దైవప్రవక్త (స) కాళ్ళకు గాయాలు కూడా అయ్యాయి. కాలి గుర్తులు పడకుండా ముని వ్రేళ్ళపై నడిచారని కూడా చెప్పుకోవడం జరుగుతోంది. అందుకనే ఆయన కాళ్ళకు గాయాలై ఉండవచ్చు. మొత్తానికి, ఏది ఏమైనా, హజ్రత్ అబూ బక్ర్ (ర) గారి వెంట ఆ కొండ దాపుకు చేరుకున్నారు. హజ్రత్ అబూ బక్ర్ (ర) ఆయన్ను ఎత్తుకొని పరుగిడి కొండ శిఖరంపై ఉన్న ఓ గుహ దగ్గరకు చేరు కున్నారు. చరిత్రలో ఈ గుహ 'గారె సౌర్' (సౌర్ గుహ) గా పిలువబడుతోంది.[11]

## గుహ లోపల

గుహ దగ్గరకు వెళ్ళిన తరువాత హజ్రత్ అబూ బక్ర్ (ర), దైవప్రవక్త (స)తో, "తమరు ఇప్పుడే ఈ గుహలోనికి ప్రవేశించకండి. ముందు నేను వెళ్ళి చూసివస్తాను. ప్రమాదకరమైన విషయం ఏదైనా ఉంటే ముందు దాన్ని నేనే భరిస్తాను" అంటూ గుహలోనికి ప్రవేశించారు. ఆ గుహను శుభ్రపరిచారు. ఓ ప్రక్క రెండు కన్నాలు కనబడ్డాయి. వాటిని తన లుంగీ చించి మూసివేశారు. అయినా మరో రెండు కన్నాలు మిగిలే ఉన్నాయి. హజ్రత్ అబూ బక్ర్ (ర) ఆ రెండు కన్నాలను తన కాలి బొటన వ్రేళ్ళతో మూసేసి మహాప్రవక్త (స)ను లోనికి పిలిచారు. లోనికి వెళ్ళిన ప్రవక్తశ్రీ (స) అబూ బక్ర్ (ర)గారి ఒడిలో తన శిరస్సును పెట్టి పడుకున్నారు. ఇటు అబూ బక్ర్ (ర) కాలిని ఏదో విష జంతువు కరిచింది. దైవప్రవక్త(స) ఎక్కడ మేల్కొంటారో అనే భయంతో ఆయన కదల నైనా కదలలేదు. అయితే బాధ వల్ల ఆయన కళ్ళవెంట అశ్రువులు టపటప మంటూ మహాప్రవక్త (స) చెక్కిళ్ళపై రాలాయి. (ఇలా ఆయన (స) మేల్కొ న్నారు) "నీకేమైంది అబూ బక్ర్?" అని అడిగారు మహాప్రవక్త (స). "నా తల్లి దండ్రులు మీ కోసం అర్పితం! ఏదో నన్ను కాటేసింది" అని అనగా,

---

11. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/95; ముక్తరుస్సీరత్ -షేక్ అబ్దుల్లా, పుట.167

https://teluguislam.net



దైవప్రవక్త(స) తన ఉమ్మిని కుట్టిన చోట పెట్టారు. వెంటనే బాధ మటు మాయమై పోయింది.[12]

ఈ గుహలో వీరిద్దరు కలసి మూడు రాత్రులు దాగి గడిపారు.[13] అంటే శుక్రవారం, శనివారం మరియు ఆదివారం రాత్రులు అన్నమాట. ఈ మధ్య కాలంలో అబూ బక్ర్ (ర)గారి తనయుడు అబ్దుల్లా కూడా వచ్చి వీరితోపాటే రేయి గడిపేవారు. హజ్రత్ ఆయిషా (ర)గారి కథనం ప్రకారం, అబ్దుల్లా మంచి తెలివి గలవాడు, విషయాన్ని అర్థం చేసుకొనే సామర్థ్యం కలవాడు. తెల్లారక ముందే చీకట్లో వారిద్దరిని అక్కడ విడిచి ఉదయం తాను మక్కా ప్రజలతో కలసిపోయేవారు. అంటే ఆయన రాత్రి మక్కాలో ఉన్నట్లుగానే వారికి నమ్మకం గలిగేటట్లు మెలిగేవారు. మహాప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర) గురించి మక్కావాసులు చేసే కుతంత్రాలకు సంబంధించిన ఏదైనా మాట వింటే దాన్ని గుర్తుపెట్టుకొని బాగా చీకటి పడగానే గుహ దగ్గరకు వెళ్ళిపోయేవాడు.

ఇటు అబూ బక్ర్ (ర) గారి బానిస ఫహీరా మేకలు కాస్తూ రాత్రి ఓ ఝాము పొద్దుపోయిన తరువాత ఆ మేకలతో గుహ దగ్గరికి వెళ్ళేవారు. ఇలా వీరిద్దరూ బాగా కడుపునిండా పాలు త్రాగేవారు. ఉదయం కాగానే ఫహీరా మేకలు తోలుకొని అక్కడి నుండి దూరంగా వెళ్ళిపోయేవారు. మూడు రాత్రులు కూడా ఆయన ఇలాగే చేశారు[14] (అదేకాదు) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబీ బక్ర్ (ర) మక్కాకు వెళ్ళిపోయిన తరువాత ఆయన అడుగుజాడలు కనబడకుండా వాటిపై నుండి తన మేకలను తోలుకొని వెళ్ళడం కూడా జరిగేది.[15]

## ఖురైష్ విఫలయత్నం

హత్య చేయడానికి ఖురైషులు ఎన్నుకున్న ఆ రాత్రి గడిచిపోయింది. తెల్లవారిన తరువాత దైవప్రవక్త (స) చేయిదాటిపోయారన్న విషయం వారికి పూర్తిగా నమ్మకంగా అర్థమైంది. ఇక వారి క్రోధానికి అంతేలేదు. ముందు

---

12. ఇది జరీన్, హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ ద్వారా ఉల్లేఖించిన కథనం ప్రకారం, ఈ విషయం ఆ తరువాత బయటపడింది (అంటే మరణమప్పుడు ప్రభావం చూపింది అని అర్థం). ఇదే ఆయన మరణానికి కూడా కారణభూతమైంది. చూడండి, మిష్కాత్-2/556, అబూ బక్ర్ (ర) అధ్యాయం.
13. ఫత్‌హుల్ బారి-7/336
14. సహీ బుఖారి-1/553, 554
15. ఇబ్నె హష్షామ్-1/486

https://teluguislam.net



హజ్రత్ అలి(ర)పై ఆ కోపాన్ని తీర్చుకున్నారు. ఆయన్ను ఈడ్చుకుంటూ కాబా గృహం వద్దకు తీసుకువచ్చారు. బహుశా ఆ ఇద్దరి జాడ ఏమైనా తెలుస్తుందేమో అన్న ఉద్దేశ్యంతో ఆయన్ను కొంతకాలం వరకు నిర్బంధంలో ఉంచారు.[16] కాని హజ్రత్ అలి (ర)ద్వారా ఏ విషయం బయటపడకపోవడంతో నేరుగా అబూ బక్ర్ (ర)గారి ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. హజ్రత్ అస్మా (ర) బిన్తె అబూ బక్ర్ (ర) (అబూ బక్ర్ (ర) గారి కుమార్తె) బయటకు వచ్చారు. "మీ నాన్న ఎక్కడ?" అని అడిగారు వారు. "ఏమో! నాకేం తెలుసు మా నాన్నగారెక్కడున్నారో?" అని బదులిచ్చారామె. ఇది విన్న అబూ జహల్ కోపం పట్టలేక ఆమె చెంపపై పెద్దగా చరిచాడు. ఆ దెబ్బకు ఆమె చెవి పోగు ఎగిరి క్రిందపడిపోయింది.[17]

ఖురైషులు ఓ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి, ఆ ఇద్దరిని పట్టుకోడానికి సాధ్యమైనన్ని శక్తియుక్తుల్ని, వనరుల్ని ప్రయోగించాలని తీర్మానించుకున్నారు. మక్కా నుండి బయటకు పోయే మార్గాలన్నిటిపై - ఆ మార్గాలు ఎటు పోయేవి అయినా సరే- గట్టి నిఘా ఉంచడం జరిగింది. అలాగే ఓ ప్రకటన చేస్తూ ఎవరైనా సరే, ముహమ్మద్ (స) మరియు అబూ బక్ర్ (ర)ను సజీవంగా లేదా నిర్జీవంగా బంధించి తెస్తే ఆ ఇద్దరిలో ఒక్కొక్కరికి వంద ఒంటెలను బహూకరిస్తాం అని చాటింపు వేయించారు.[18] ఈ ప్రకటన ఫలితంగా వాహనాలపై, కాలినడకనా పోయి వెదికేవారు, అడుగుజాడలు చూసి జాడ తెలుసుకునే అడుగుజాడల నిపుణులు వెదుకులాటనారంభించారు. కొండల్లో, లోయల్లో, పల్లపు ప్రదేశాల్లో, మెట్ట ప్రాంతాలన్నింటిలోనూ చెల్లాచెదరై ప్రవక్త (స)ను వెదకనారంభించారు. కాని ఫలితం దక్కలేదు.

వెదుకుతూ వెళ్ళేవారు 'సౌర్ గుహ' ముఖద్వారం వద్దకు కూడా చేరుకున్నారు. కాని అల్లాహ్ అభీష్టం మరో విధంగా ఉంది. సహీ బుఖారి గ్రంథంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) చెప్పినట్లుగా ఓ ఉల్లేఖనం ఉంది. దీన్ని హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖించారు. ఆ ఉల్లేఖనంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇలా చెప్పారు:

"నేను దైవప్రవక్త (స) గారి వెంట గుహలో ఉన్నాను, తల పైకెత్తి చూద్దును గదా అక్కడ వెదుకులాడే మనుషుల పాదాలు నాకు కనిపిస్తున్నాయి. నేను ప్రవక్త (స)తో, 'దైవప్రవక్తా! ఒకవేళ వీరు ఏ ఒక్కరైనా తమ చూపుల్ని క్రిందికి వాల్చి చూస్తే? ఇంకేముంది! మనం కనబడతాం' అన్నాను. దానికి

---

16. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/96

17. ఇబ్నె హష్షామ్-1/487

18. సహీ బుఖారి-1/554

https://teluguislam.net



ఆయన(స), అబూ బక్ర్ మాట్లాడకు. (మనం) ఇద్దరం, మా ఇద్దరికి తోడు మూడోవాడు అల్లాహ్ అన్నారు." మరో ఉల్లేఖనంలోని పదాలు ఇలా ఉన్నాయి.

"అబూ బక్ర్(ర) ! అల్లాహ్ మూడవవానిగా తోడుండే ఆ ఇద్దరి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?"[19]

యదార్థం ఏమిటంటే, ఇది ఓ మహత్యం. అల్లాహ్ తన ప్రవక్త (స)కు చేసిన సహాయమది. కాబట్టి వెదికేవారికి, దైవప్రవక్త (స)కు మధ్య కొన్ని అడుగులకంటే ఎక్కువ దూరం లేరు. వారు అక్కడి నుండే వెనక్కి మరలి పోయారు.

## మదీనా బాటలో

దైవప్రవక్త (స)ను పట్టుకోవాలనే దుగ్ధాగ్ని చల్లారిపోయింది. వెదుకులాట ఆగిపోయింది. మూడు రోజుల విఫల యత్నం నీరుకారిపోయిన తరువాత ఖురైషుల భావోద్రేకాలు చల్లబడిపోయాయి. అప్పుడుగాని మహాప్రవక్త (స) హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి వెంట మదీనాకు బయలుదేరలేదు. అబ్దుల్లా బిన్ అరీఖత్ లైసీ అనేవాడు ఎడారి బాటల గురించి బాగా తెలిసిన వ్యక్తి. ముందే ప్రతిఫలం ముట్టజెబుతామనే షరతుపై మదీనాకు చేరవేసే ఒప్పందం కుదుర్చు కొని ఉన్నారు దైవప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర)లు. ఇతను ఇంకా ఖురైష్ ధర్మంలో ఉన్నవాడే. అయితే చాలా నమ్మకస్తుడు. కాబట్టి అతనికి మదీనాకు ప్రయాణం సాగించేందుకు వాహనాలను కూడా ఇచ్చి ఉంచడం జరిగింది. మూడు రాత్రులు గడిచిపోయిన తరువాత అతను రెండు వాహనాలను తీసుకొని 'సౌర్' గుహ దగ్గరికి రావాలని చెప్పి ఉంచారు. అతను సోమవారం రాత్రి- అది రబీఉల్ అవ్వల్ మాసం, హిజ్రీ శకం 1, నెల పాడుపు రాత్రి

---

*19. సహీ బుఖారి-1/516, 558. ఇక్కడ ఓ విషయం గమనార్హం. అబూ బక్ర్ (ర) గారి భయం తన ప్రాణం గురించి కాదు. ఈ ఉల్లేఖనంలో చెప్పిన విషయం గురించే ఆయన భయం అంతాను. అంటే అబూ బక్ర్ (ర) వెదికేవారిని చూసి దైవప్రవక్త (స)కు ఏ ప్రమాదం వచ్చిపడుతుందోననే భయం పట్టుకుంది. ఈ సందర్భంలో ఆయన ఇలా చెప్పారు. 'నేనొక్కడినే, చనిపోతే ఒక్కణ్ణే చస్తాను. ఒకవేళ తమరు చంపబడితే ఈ పూర్తి సమాజం సర్వనాశనం అవుతుంది.' ఈ సందర్భంలో మహాప్రవక్త (స), "బాధపడకు. అల్లాహ్ తప్పకుండా మన వెంట ఉన్నాడు" అన్నారు. చూడండి, ముక్తసరుస్సీరత్-షేఖ్ అబ్దుల్లా, పుట.168*

https://teluguislam.net



(సెప్టెంబర్ 16, 622) - ఆ ఒంటెల్ని తీసుకొని గుహ దగ్గరికి వచ్చేశాడు. ఆ సందర్భంలోనే అబూ బక్ర్ (ర), దైవప్రవక్త (స)కు మేలైన ఓ పెంటి ఒంటెను ప్రయాణార్థం అందిస్తూ ఈ రెండు ఒంటెల్లో ఆయనకు నచ్చినదాన్ని స్వీకరించమని అర్థించారు. మహాప్రవక్త (స) ఆ ఒంటెను ఉచితంగా తీసుకోకుండా దాని ధరను అబూ బక్ర్ (ర)కు చెల్లించడం జరిగింది.

ఇటు అస్మా (ర) (అబూ బక్ర్(ర)గారి కుమార్తె) ప్రయాణానికి కావలసిన భోజన సామగ్రిని అక్కడికి తీసుకొని వచ్చారు. అయితే వాటిని ఒంటెపై వేసి కట్టడానికి త్రాడును మరచి వచ్చారు. బయలుదేరే సమయం రాగానే చద్దిమూటను ఒంటెపై వేసి వ్రేలాడదీయడానికి ఉపక్రమించినప్పుడు తాను త్రాడు మరచి వచ్చాననే విషయాన్ని గుర్తించారు. వెంటనే నడుముకు చుట్టుకునే పట్కావస్త్రం విప్పి దాన్ని రెండుగా చించి ఓ ముక్కతో చద్దిమూటను ఒంటెపై వేసి వ్రేళ్ళాడదీశారు. రెండో ముక్కను తిరిగి తన నడుముకు చుట్టుకున్నారు. ఆ కారణంగానే ఆమెకు 'జాతున్నితా ఖైన్' అనే బిరుదు లభించింది.[20]

ఆ తరువాత మహాప్రవక్త (స), అబూ బక్ర్ (ర)లు కలసి అక్కడ నుండి బయలుదేరారు. ఆమిర్ బిన్ ఫహీరా (ర) కూడా వెంటే ఉన్నారు. అబ్దుల్లా బిన్ అరీఖత్ వారిని వెంటబెట్టుకొని ఆ రాత్రే సముద్ర తీరం వెంట వెళ్ళే మార్గాన్ని అనుసరించాడు.

గుహ నుండి బయలుదేరగానే ముందు అతను యమన్ వైపునకు వెళ్ళే దారిని అనుసరించాడు. దక్షిణం వైపు చాలా దూరం వెళ్ళిన తరువాత పశ్చిమం వైపునకు తిరిగి సముద్ర తీర మార్గాన్ని పట్టాడు. ఆ తరువాత సాధారణంగా మనుషులు సంచరించనటువంటి మరో మార్గం వైపు మళ్ళాడు. ఈ మార్గం గురించి చాలా మందికి అవగాహన ఉండేది కాదు. ఈ దారి ఎర్ర సముద్ర తీరానికి అతి చేరువ నుండి పోయే మార్గం. ఒకరిద్దరు తప్ప ఆ మార్గంపై నడిచేవారెవరూ ఉండరు.

మహాప్రవక్త (స) ఈ మార్గంపై వెడుతూ ఏయే ప్రదేశాలగుండా అయితే వెళ్ళారో, ఆ ప్రదేశాల గురించి ఇబ్నె ఇస్‌హాక్ తన గ్రంథంలో పేర్కొనడం జరిగింది. ఆయన కథనం ప్రకారం, ఆ మార్గదర్శకుడు ఆయన్ను తీసుకొని బయలుదేరి తీరం వెంబడి వెడుతూ 'జీరీనె అస్ఫాన్'కు వెళ్ళి దారి మార్చాడు.

---

*20. సహీ ఉల్ బుఖారి-1/553, 555; ఇబ్నె హష్షామ్-1/482*

https://teluguislam.net



ఆ తరువాత 'జీరీనె అమజ్' గుండా వెడుతూ ముందుకు వెళ్ళి 'ఖదీద్' అనే చోటును దాటేశాడు. ఆ తరువాత తిరిగి మార్గాన్ని మార్చి ముందుకుపోయి 'ఖరారా' చేరాడు. ఆ తరువాత 'సనీయతుల్ మర్రా', 'లఖఫ్' ఎడారి గుండా వెడుతూ 'హిజాజ్' ఎడారి ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడ నుండి మజాహ్ మూలమలుపు తిరిగి జుల్ ఫుజ్వీన్ మలుపున ఉన్నటువంటి పల్లపు ప్రదేశంలోనికి వెళ్ళిపోయాడు. ఆపై జీకశ్ర్ కొండ లోయ నుండి ప్రయాణించి 'అబాబీద్', దాని తరువాత 'ఫాజా' వైపునకు వెళ్ళాడు. ఆ మీదట 'అర్జ్'లో విడిది చేశాడు. అక్కడ నుండి బయలుదేరి 'రకూబా'కు కుడి వైపున ఉన్న 'సనియ తుల్ ఆయిర్' లోనికి వెళ్ళిపోయాడు. చివరికి 'రయిమ్' లోయలోనికి వెళ్ళి విడిది చేశాడు. ఆ తరువాత 'ఖుబా'కు వచ్చిచేరాడు. [21]

రండి! ఇక మనం మార్గంలో జరిగిన సంఘటనల గురించి కూడా తెలుసుకుందాం.

1. సహీ బుఖారీ గ్రంథంలోని హజ్రత్ అబూ బక్ర్ (ర)గారి ఉల్లేఖన సారాంశం.

"మేము (గుహ నుండి బయలుదేరి) రాత్రి, పగలు రెండు ఝాముల వరకు ప్రయాణిస్తూనే ఉన్నాం. మిట్ట మధ్యాహ్నం అయ్యేటప్పటికీ ఆ బాటన ఎవరూ నడిచినట్లు ఆనవాళ్ళు లేవు. ఆ సమయంలోనే మాకు ఓ పొడుగాటి ఎత్తయిన బండరాయి కనబడింది. దాని క్రింద నీడగా ఉండడం వలన మేము అక్కడనే విడిది చేశాము. నేను నా చేతులతో ఆ ప్రదేశాన్ని శుభ్రపరచి నా అంగ వస్త్రాన్ని అక్కడ పరచి దైవప్రవక్త (స)తో అక్కడ కాసేపు పడుకొమ్మని, చుట్టూ పరికిస్తూ ఉంటానని అభ్యర్థించాను. ఆయన పడుకోగానే జాగ్రత్త కోసం చుట్టూ తిరిగి అటూ ఇటూ చూడ్డానికి బయటకు వచ్చాను. చూద్దునుగదా ఓ కాపరి తన మేకలను తోలుకొని ఆ బండ వైపే వస్తున్నాడు. అతను ఆ బండ నీడన కూర్చుం దామనే వస్తున్నాడు కాబోలు. నేనతనితో, "ఓ యువకుడా! నీవు ఎవరి తాలూకు మనిషివి?" అని అడిగాను. అతను మక్కా లేదా మదీనాకు చెందిన ఓ వ్యక్తి పేరు చెప్పాడు.

"నీ మేకలు ఏమైనా పాలు ఇస్తాయా?" అని అడిగాను.

"ఔను" అని సమాధానమిచ్చాడతను.

---

21. ఇబ్నె హష్షామ్-1/491, 492

https://teluguislam.net



"మరి నేను వాటి పాలను పితుక్కోవచ్చునా?"

"తప్పకుండా" అంటూ ఓ మేకను పట్టుకొని నా దగ్గరకు తీసుకొచ్చి, "ఆగండి, దీని పొదుగు నుండి మట్టి, వెంట్రుకలను శుభ్రం చేయండి ముందు" అన్నాడు.

ఆ తరువాత అతను ఓ చిన్న పాత్రలో కొన్ని పాలను పితికాడు. నా దగ్గర ఓ తోలు పాత్ర ఉంది. దాన్ని మహాప్రవక్త (స) నీరు త్రాగడానికి, వుజూ చేయడానికి దగ్గర ఉంచుకుని ఉన్నాను (పాలు అందులో పోశాను). దైవప్రవక్త (స) గారి వద్దకు వచ్చానుకాని ఆయన్ను మేల్కొల్పాలంటే మనస్సు ఒప్పుకోవడం లేదు. ఆయన (స) స్వయంగానే మేల్కొన్న తరువాత ఆయన దగ్గరకు వచ్చి ఆ పాలలో కొన్ని నీళ్ళు పోశాను. పాలు కొంత చల్లబడ్డాయి. దైవప్రవక్త (స)కు త్రాగమని ఆ పాలనిచ్చాను. ఆయన తాగిన తరువాత నాకు తృప్తి కలిగింది. "ఇంకా బయలుదేరే సమయం రాలేదా?" అని అడిగారు. ఆ తరువాత మేము అక్కడి నుండి బయలుదేరాము.[22]

2. ఈ ప్రయాణంలో హజ్రత్ అబూ బక్ర్ (ర) దైవప్రవక్త (స)కు వెనుకనే ఉండేవారు. అంటే స్వారీపై కూర్చున్నప్పుడు దైవప్రవక్త (స) వెనుకన కూర్చుని ఉండేవారు. వృద్ధాప్య లక్షణాలు అగపడుతూ ఉండడం వలన అందరూ ఆయన్నే చూసేవారు. మహాప్రవక్త (స) ఇంకా యువకునిగానే అగుపడుతున్నారు. గనుక చూసేవారు ఆయన వైపు అంత నిశితంగా చూసేవారు కాదు. ఫలితంగా ఎవరైనా మార్గమధ్యంలో కలసి మాట్లాడితే ముందు అబూ బక్ర్ (ర)నే పలుకరించేవారు. మీ ముందున్న వ్యక్తి ఎవరూ అని అడిగితే ఆయన, ఈయన నాకు దారిచూపే వాడు అని చెప్పేవారు. అర్థం చేసుకునేవాడు, ఈ ప్రయాణంలో మార్గాన్ని చూపేవాడు! అనుకునేవాడు. కాని అబూ బక్ర్ (ర) దృష్టిలో మాత్రం మార్గం అంటే మేలు వైపునకు మార్గం చూపేవాడు అని భావం.[23]

3. ఈ ప్రయాణంలోనే మహాప్రవక్త (స), ఉమ్మె మఅబద్ ఖుజాయియా గుడారం ఉన్న చోట నుండి వెళ్ళడం జరిగింది. ఈమె ఆరోగ్యవంతురాలైన మహిళ. మోకాళ్ళు పట్టుకొని తన గుడారం వెలుపల కూర్చుని ఉండడం

22. సహీ బుఖారి-1/510
23. సహీఉల్ బుఖారి, అనస్(ర)గారి ఉల్లేఖనం-1/556

https://teluguislam.net



ఆమెకు అలవాటు. వచ్చిపోయే వారికి తన దగ్గర ఉన్న భోజన సామగ్రి నుండే తినిపించేవారు, దాహం తీర్చేవారు. మహాప్రవక్త (స) ఆమె వద్దకు వెళ్ళి, "తిన డానికి ఏదైనా ఉందా" అని అడిగారు. ఆమె, "దైవసాక్షి! నా దగ్గర ఏదైనా ఉంటే తప్పకుండా మీ అతిథి సత్కారాలు చేసేదాన్ని. ప్రస్తుతం ఇంట ఏదీ లేదు. మేకలు కూడా దగ్గరలో మేయడం లేదు" అని తన నిస్సహాయతను ప్రకటిం చారు. అది కరువుకాలం.

మహాప్రవక్త (స) దృష్టి ఓ మూలన కట్టి ఉన్న మేకపై పడింది.

"ఉమ్మె మఅబద్, ఈ మేక ఏమిటీ ఇక్కడుంది?" అని ప్రశ్నించారు.

"బలహీనత వల్ల అది మందతో పోలేకపోయింది" అన్నారామె.

"పాలు ఏమైనా ఇస్తుందా ఇది?" అని అడిగారు.

"పాలా? అది చాలా బలహీనంగా ఉంది. పాలెలాగుంటాయి?" అని అన్నారు.

"అనుమతిస్తే పాలు పితుకుతాను" అన్నారు మహాప్రవక్త (స).

"నా తల్లిదండ్రులు తమకు అర్పితం! మీకే ఈ మేకలో పాలు కనబడు తున్నట్లయితే తప్పకుండా పితుక్కోండి" అన్నారామె.

ఆ తరువాత మహాప్రవక్త (స) ఆ మేక పొదుగును తన చేతితో నిమిరారు. అల్లాహ్ నామం పలికి ప్రార్థించారు, మేక వెంటనే తన కాళ్ళను పాలు పితుక్కోమన్నట్లు ప్రక్కలకు చాచింది. పొదుగు పాలతో నిండిపోయింది. దైవ ప్రవక్త (స) ఉమ్మె మఅబద్ దగ్గర ఉన్న ఓ పెద్ద పాత్ర తీసుకొన్నారు. ఈ పాత్ర లోని పాలు ఓ సమూహానికే సరిపోయేటంత పెద్ద పాత్ర అది. నురగలు పైకి వచ్చిందాకా ఆ పాత్రలో పాలు పితికారు. ఆ పాలను ఉమ్మె మఅబద్‌కు త్రాగించారు. కడుపార పాలు త్రాగారామె. తమ వెంటనున్న వారందరికీ త్రాపిం చారు. వారు కడుపు నిండా పాలు త్రాగారు. ఆ తరువాత దైవప్రవక్త (స) కూడా పాలు త్రాగారు. ఆ తరువాత చూస్తే తిరిగి అంతే నిండుగా పాలున్నాయి ఆ పాత్రలో. వాటిని ఉమ్మె మఅబద్ దగ్గరే ఉంచేసి ముందుకు కదలిపోయారు దైవప్రవక్త (స).

దైవప్రవక్త (స) వెళ్ళిన కొంత సేపటికే ఆమె భర్త అబూ మఅబద్ తన నడవడానికే శక్తిలేని బలహీనమైన మేకల్ని తోలుకొని ఇంటికి చేరారు. పాలను

https://teluguislam.net



చూసి ఆశ్చర్యం వెలిబుచ్చుతూ, "ఈ పాలు నీ వద్దకెలా వచ్చాయి. నా మేకలు చాలా దూరం వరకు వెళ్ళి మేసొచ్చాయే? ఇంట పాలిచ్చే మేక ఒక్కటి కూడా లేదే?" అని అడిగారు.

" మనింటికి ఓ శుభప్రదుడైన వ్యక్తి వచ్చారు. ఆయన ఇలా ఇలా అని చెప్పారు. ఆయన పరిస్థితి ఇలాగుంది" అని విషయం అంతా పూసగ్రుచ్చినట్లు చెప్పారామె.

"అయితే ఆయన ఖురైషులు వెదుకుతున్న మనిషే అన్నమాట. ఆయన గురించి ఇంకాస్త విపులంగా చెప్పు" అని అడిగారు అబూ మఅబద్.

ఉమ్మె మఅబద్ ఆయన ముఖకవళికల్ని, రూపురేఖల్ని, ఆయన గుణగణాలను, వినేవాడు ఆయన్ను ఎదురుగా చూస్తున్నట్లే వర్ణించారు - ఈ గ్రంథం చివరన ఈయన(స)గారి సుగుణాలను చెప్పడం జరుగుతుంది - ఈ గుణగణాలను విన్నంతనే అబూ మఅబద్, "దైవసాక్షి! ఎవరి గురించి అయితే ప్రజలు రకరకాలుగా చెప్పుకుంటున్నారో ఆ ఖురైష్‌కు చెందిన వ్యక్తే ఈయన. ఆయన(స)గారి అనుచరుణ్ణి కావాలని అనుకుంటున్నాను. మార్గం ఏదైనా కనబడితే తప్పకుండా ఆయనకు అనుచరుణ్ణయిపోతాను" అన్నారు.

ఇటు మక్కాలో, అందరూ వినేటట్లు ఓ వాణి వినవచ్చింది. చెప్పేవాడు ఎవడూ కనబడడం లేదు. ఆ వాణి ఇది:

"అల్లాహ్, ఉమ్మె మఅబద్ గుడారంలో వెలిసిన ఆ ఇద్దరి మిత్రులకు శుభం కలిగించుగాక! వారిద్దరు శుభంగా అక్కడికి వెళ్ళారు. క్షేమంగానే అక్కడి నుండి బయలుదేరారు. ముహమ్మద్ (స)కు మిత్రుడైనవాడు సాఫల్యం పొందినట్లే. అయ్యో ఖుసై! అల్లాహ్ అతని నుండి సాటిలేని మేటి ఘనకార్యాలను, నాయకత్వాలను లాక్కున్నాడు! బనూ కఅబ్‌కు చెందిన ఆ మహిళ ఇల్లు, విశ్వాసుల సంరక్షణకు విడిది శుభప్రదమైనదైపోవుగాక. మీరు వెళ్ళి ఆ మహిళతో ఆమె మేక గురించి జరిగిన వృత్తాంతం అడగండి. మీరే గనక ఆ విషయం ఆ మేకను అడిగినా అది సాక్ష్యం ఇస్తుంది."

హజ్రత్ అస్మా (ర) ఇలా అంటారు:

"దైవప్రవక్త(స) ఎటు వెళ్ళారో తెలుపడానికి ఓ జిన్ను దిగువ మక్కా నుండి ఈ వచనాలు చెప్పుకుంటూ వచ్చాడు. ప్రజలు అతని వెంటే వస్తున్నారు.

https://teluguislam.net



అతని మాటలు వింటున్నారు కాని అతణ్ణి మటుకు చూడలేకపోయారు. చివరికి అతను ఎగువ మక్కా నుండి వెళ్ళిపోయాడు. మేము అతని మాటలు విన్నంతనే మహాప్రవక్త (స) ఎటు వైపునకు వెళ్ళారో తెలిసిపోయింది. అంటే మహాప్రవక్త (స) మదీనా వైపే వెళ్ళారని నిర్ధారణ అయింది."[24]

4. దారిలో సురాకా బిన్ మాలిక్ అనేవాడు వారిని వెంటాడాడు. ఆ వెంటాడిన తీరును ఖుద్దు సురాకా నోటనే విందాం:

"నేను, నా జాతి బనీ ముద్‌లిజ్ సమావేశంలో కూర్చొని ఉన్నాను. అంతలోనే ఓ వ్యక్తి వచ్చి మా దగ్గర నిలబడ్డాడు. అతను నన్ను ఉద్దేశించి, "ఓ సురాకా! నేను ఇప్పుడే తీరం వెంబడి కొందరు పోతూ ఉండగా చూశాను. బహుశా వారు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులై ఉండవచ్చు" అన్నాడు. నేను అప్పుడే గ్రహించాను, వారు ముహమ్మద్ (స) మరియు ఆయన అనుచరులని. కాని నేను అతని మాటల్ని ఖండిస్తూ, "కాదు, నీవు చూసింది ఫలానా ఫలానా వ్యక్తుల్ని, వారు మా కళ్ళ ముందు నుండే అటుగా వెళ్ళిపోయారు" అని చెప్పాను. ఆ తరువాత కాసేపు ఆ సమావేశంలోనే కూర్చొని లేచి ఇంటికి వెళ్ళాను. నా దాసీని నా గుర్రం తీసుకొని వెళ్ళి ఎత్తయిన తిన్నె వెనుక నిలబెట్టి నా కోసం నిరీక్షిస్తూ ఉండమని ఆదేశించాను. నేను నా బరిశెను తీసుకొని ఇంటి పెరటి దారిన బయటకు వచ్చాను. నా లాఠీ మొన భూమిపై రాసుకుంటూ పోతుంది. ఇలా నేను నా గుర్రం వద్దకు చేరుకున్నాను. దాన్నెక్కి దౌడు తీయించాను, అది ఎప్పటిలాగే దౌడు తీస్తోంది. అలా వెంటాడుతూ నేను వారి దాపుకు వచ్చేయగా నేను నా గుర్రంతో సహా క్రిందపడిపోయాను. నేను లేచి అంబుల పొది నుండి బాణాలను బయటకు లాగి, నేను వారికి నష్టం కలిగించగలనా లేదా? అనే శకునాన్ని చూశాను. శకునంలో వచ్చిన బాణం ప్రకారం నేను వారికి ఎలాంటి ప్రమాదాన్ని కలిగించలేను అని తేలింది. ఇది నాకు ఇష్టమైన శకునం కాదు. దీన్ని లెక్కచేయకుండా తిరిగి గుర్రమెక్కి దౌడు తీయించాను. మహాప్రవక్త (స) ఖుర్ఆన్ పారాయణం చేస్తున్న శబ్దం నా చెవుల్లో పడే అంత దాపుకు వచ్చేశాను. ఆయన నా వైపు చూడడం లేదు కాని

---

24. జాదుల్ మఆద్-2/53,54; బనూ ఖుజాఅ నివసించే ప్రదేశాన్ని దృష్టిలో పెట్టు కొని చూస్తే ఈ సంఘటన గుహ నుండి బయటపడిన రెండో రోజు సంభవించిందని చెప్పవచ్చు.

https://teluguislam.net



అబూ బక్ర్ (ర) మాత్రం మాటిమాటికి వెనక్కు తిరిగి చూస్తూనే ఉన్నారు. అదే సమయంలో నా గుర్రం ముందు కాళ్ళు రెండూ భూమిలో పాతుకొని పోయాయి. నేను గుర్రం మీది నుండి క్రిందపడిపోయాను. గుర్రాన్ని అదిలించినప్పుడు అది లేచి నిలబడడానికి ప్రయత్నించింది. కాని తన కాళ్ళను ఎంతో కష్టం మీద భూమి నుండి లాగగలిగింది. అది సరిగా లేచి నిలబడగానే దాని గిట్టెల గురుతుల్లో నుండి పొగలాంటి ధూళి ఆకాశం వైపునకు పోతున్నట్లు కనిపించింది. తిరిగి నేను బాణాలతో శకునాన్ని చూశాను. అప్పుడు కూడా నాకు ఇష్టంకాని బాణమే బయటకు వచ్చింది. ఆ తరువాత నేను రక్షించమని వారినుద్దేశించి అరిచాను. వారు నిలబడిపోయారు, నేను నా గుర్రం ఎక్కి వారి దగ్గరకు ఛేరుకున్నాను. వారిని ఆపినప్పుడే, నా మనస్సులో, మహాప్రవక్త (స)గారి వ్యవహారమే ఆధిక్యత వహించగలదనే నమ్మకం నాటుకుపోయింది.

నేను, మహాప్రవక్త (స)తో, మీ జాతి మిమ్మల్ని పట్టి ఇచ్చినందుకు బహుమతిని ప్రకటించింది. నేను వారి ఎత్తుగడలను గురించి తమరికి తెలియజేయడానికి వచ్చాను అని అంటూ నా చద్దిమూటను, నా దగ్గరున్న ఆయుధ సామగ్రిని వారికి అందించబోయాను. వారు నా వద్ద నుండి ఎలాంటి వస్తువును తీసుకోలేదు. నన్ను మరే ప్రశ్నా అడగలేదు. కేవలం, మా గురించి ఈ విషయం రహస్యంగా ఉంచమని చెప్పారు. ఆ తరువాత నేను, నాకు శాంతి పత్రాన్ని రాసివ్వమని అభ్యర్థించాను. మహాప్రవక్త (స) ఆమిర్ బిన్ ఫహీరాకు రాసి ఇవ్వమని ఆదేశించగా ఆయన ఓ తోలుపై శాంతి పత్రాన్ని రాసి నాకిచ్చారు. ఆ పిదప మహాప్రవక్త (స) ముందుకు సాగిపోయారు."[25]

ఈ సంఘటన గురించే హజ్రత్ అబూ బక్ర్ (ర) ఇలా ఉల్లేఖించారు:

"మేము బయలుదేరినప్పుడు జాతి యావత్తూ మమ్మల్ని వెదకడంలోనే నిమగ్నమై ఉంది. అందులో కేవలం ఒక్క సురాకా బిన్ మాలిక్ బిన్ జాషమ్ తప్ప ఇంకెవ్వరూ మమ్మల్ని కనుగొనలేకపోయారు. అతను గుర్రమెక్కి వచ్చాడు. నేను అతణ్ణి చూసి, "దైవప్రవక్తా! అడిగో ఇతను మనల్ని వెంటాడి పట్టుకోడానికి వస్తున్నాడు" అని అన్నాను.

---

*25. సహీ బుఖారి-1/554. బనీ ముద్‌లిజ్ నివాస స్థలం రాబిగ్‌కు దాపున ఉండేది. సురాఖా వారిని వెంటాడినప్పుడు మహాప్రవక్త (స) ఖదియాను దాటి వెళ్ళిపోయారు. (జాదుల్ ముఆద్-2/53) బహుశా గుహ నుండి బయటకు వెళ్ళిన మూడో రోజున ఈ వెంటాడే సంఘటన జరిగిందనడానికి ఇది గట్టి ఆధారం.*

https://teluguislam.net



"భయపడకండి, అల్లాహ్ మన వెంటే ఉన్నాడు" అని ధైర్యం చెప్పారాయన.[26]

ఏది ఏమైనా, సురాకా మాత్రం వెనక్కు తిరిగి వెళ్ళిపోయాడు. ప్రజలు మహాప్రవక్త (స)ను పట్టుకోడానికి ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అతనికి కనబడిన ప్రతి చోటల్లా వారిని నిలువరించి, మీరు చేసే పనిని నేను ఇదివరకే చేసివేశాను. ఇక మీ పని పూర్తి అయిపోయింది వెనక్కు మళ్ళిపొండని వారందరిని ముందుకు పోకుండా అడ్డుకోనారంభించాడు. అంటే ఉదయం మహాప్రవక్త (స)ను పట్టుకోవాలని ప్రయత్నించినవాడు చివరికి ఆయనకు రక్షణగా నిలిచి కాపాడ ప్రయత్నం చేశాడన్నమాట.[27]

5. ప్రయాణం చేస్తున్నప్పుడు దారిలో బురైదా అస్లమీ అనే ఆయన దైవప్రవక్త(స)ను కలువడం జరిగింది. ఈయన తన జాతికి సర్దారు. ఖురైషులు ప్రకటించిన గొప్ప బహుమతిని పొందాలనే ఆశతో దైవప్రవక్త (స)ను పట్టుకోడానికి బయలుదేరినవాడు. కాని మహాప్రవక్త (స) ఎదురుబడగానే ఆయనతో మాట్లాడడం జరిగింది. వెంటనే ఆయన వైపునకు మొగ్గిపోయారు. తన జాతికి చెందిన డెబ్భయి మందితో సహా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించి ముస్లిములైపోయారు. ఆ తరువాత తన తలపాగాను బరిశెకు కట్టి ఎగరవేశారు. ఆ తెల్లని వస్త్రం గాలిలో రెపరెపలాడుతూ, శాంతి దూత, సంధి ప్రదాత, ప్రపం చంలో న్యాయాన్ని ధర్మాన్ని వ్యాపింపజేసే న్యాయనిర్ణేత బయలుదేరి వస్తున్నా డనే శుభసందేశాన్ని అందించనారంభించింది.[28]

6. దారిలో దైవప్రవక్త(స)ను హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ (ర) కూడా కలిశారు. ఈయన ముస్లిముల ఓ వ్యాపార వర్గానికి చెందినవారు. సిరియా దేశం నుండి తిరిగి వస్తున్నారు. హజ్రత్ జుబైర్ (ర), దైవప్రవక్త (స) మరియు అబూ బక్ర్ (ర) ఇద్దరికీ తెల్లని వస్త్రాలు బహూకరించారు.[29]

## ఖుబాకు అరుదెంచిన దైవప్రవక్త (స)

సోమవారం, రబీఉల్ అవ్వల్ 8వ తేదీ దైవదౌత్యశకం 14- అంటే హిజ్రీ

26. సహీ బుఖారి - 1/516
27. జాదుల్ మఆద్-2/53
28. రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/101
29. సహీ బుఖారి-1/554

https://teluguislam.net



శకం ఒకటి- క్రీ.శ. 622 సెప్టెంబర్ 23వ తేదీ నాడు మహాప్రవక్త (స) ఖుబా అనే గ్రామానికి చేరుకున్నారు.[30]

హజ్రత్ ఉర్వా బిన్ జుబైర్ (ర)గారి కథనం ప్రకారం, మక్కా ముస్లిములంతా మహాప్రవక్త (స) మదీనాకు బయలుదేరారనే వార్తను అప్పటికే విని ఉండడం వలన ప్రతి రోజు ఉదయాన్నే లేచి 'హర్రా' అనే ప్రదేశానికి వచ్చి ఆయన రాక కోసం ఎదురు చూసేవారు. బాగా ఎండ ముదిరే వరకు అక్కడే నిరీక్షించి ఇండ్లకు తిరిగి వెళ్ళిపోయేవారు. ఓ రోజు బాగా ఎదురు చూసిన తరువాత తమ ఇండ్లకు మళ్ళిపోయారు. అప్పుడే ఓ యూదుడు ఓ ఎత్తయిన తిన్నె పైకి ఎక్కి ఎదురుచూడనారంభించాడు. అంతలోనే దైవప్రవక్త (స), ఆయన సహచరులు తెల్లటి వస్త్రాలు ధరించి- ఆ వస్త్రాల నుండి వెన్నెల్లాంటి కాంతి బయటకు వస్తోంది- రావడం గమనించాడు. అతను సంతోషం పట్టలేక పెద్దపెట్టున, "ఓ అరబ్బులార్లా! ఏ అదృష్టజాతకుని కోసం మీరు నిరీక్షిస్తున్నారో ఆ అదృష్ట జాతకుడు రానే వచ్చాడు" అని అరిచాడు. ఈ వార్త విన్నంతనే ముస్లిములంతా ఆయుధధారులై ఆయనను ఆహ్వానించడానికి పరుగు పరుగున వచ్చేశారు.[31]

ఇబ్నె ఖైమ్ కథనం ప్రకారం, ఈ వార్త విన్నంతనే బనీ అమ్రూ బిన్ ఔఫ్‌లో (ఖుబా ప్రజల్లో) నినదించారు. ముస్లిములు దైవప్రవక్త (స)గారి రాక గురించి కలిగిన ఆనందావేశయంలో నారయె తక్బీర్ చెబుతూ ఆహ్వానార్థం ముందుకు ఉరికారు. ఆయన్ను కలుసుకొని శుభాకాంక్షలు అందచేసి చుట్టూ మూగిపోయారు. ఆ సమయంలోనే ఆయన ప్రశాంతంగా ఉండిపోయారు. దైవవాణి అవతరించే సమయంలో అలా ప్రశాంతంగా ఉండిపోవడం మహా ప్రవక్త (స)కు పరిపాటి. అప్పుడే ఈ దివ్యావిష్కృతి అవతరించింది.

فَإِنَّ اللَّهَ هُوَ مَوْلَاهُ وَجِبْرِيلُ وَصَالِحُ الْمُؤْمِنِينَ ۖ
وَالْمَلَائِكَةُ بَعْدَ ذَٰلِكَ ظَهِيرٌ ۝

"ఒకవేళ ప్రవక్తకు వ్యతిరేకంగా మీరు ముఠా కట్టితే తెలుసుకోండి, అల్లాహ్ ఆయన యజమాని, ఇంకా జిబ్రీలు, సజ్జనులైన విశ్వాసులందరూ, దైవ దూతలందరూ ఆయన సహచరులు, సహాయకులూను."[32] (66 : 4)

31. సహీ బుఖారి-1/555

32. జాదుల్ ముఆద్-2/54

https://teluguislam.net



ఉర్వా బిన్ జుబైర్ (ర) ఇంకా ఇలా అంటారు:

"అందరిని కలసిన తరువాత ఆయన (స), వారికి కుడి వైపునకు మళ్ళి బనీ అమ్రూ బిన్ ఔఫ్ తెగ వారు ఉంటున్న చోటికి చేరారు. అది సోమవారం రోజు. రబీఉల్ అవ్వల్ నెల. అబూ బక్ర్ (ర) వచ్చేవారిని ఆహ్వానించడానికి లేచి నిలబడ్డారు. మహాప్రవక్త (స) మాత్రం మాట్లాడకుండా కూర్చుని ఉన్నారు, అన్సారులు వచ్చి రావడంతోనే దైవప్రవక్త(స)ను ఇదివరకు చూసి ఉండలేదు గనుక హజ్రత్ అబూ బక్ర్ (ర)కు సలాము చేస్తున్నారు. ఇలా మహాప్రవక్త (స)పై ఎండ వచ్చే వరకు అలానే జరుగుతూ ఉంది. ఇది చూసిన అబూ బక్ర్(ర) దైవప్రవక్త (స)పై ఎండ పడకుండా తన దుప్పటితో ఆచ్ఛాదన పట్టారు. అప్పుడు గాని వచ్చేవారికి వీరే దైవప్రవక్త (స) అని తెలియలేదు."[33]

మహాప్రవక్త (స) దర్శనార్థం, మదీనా మొత్తమే తరలి రానారంభించింది. ఇది ఓ చారిత్రాత్మకమైన దినం. ఇలాంటి సంఘటనను మదీనావాసులు ఇది వరకెన్నడూ చూసి ఉండలేదు. ఈ రోజు యూదులు కూడా దైవప్రవక్త (స) రాకకు సంబంధించిన భవిష్యవాణిని తమ కళ్ళారా చూడడం జరిగింది. వారి గ్రంథం 'జుకూక్'లో ఉన్న భవిష్యవాణి ప్రకారం, "అల్లాహ్ దక్షిణం నుండి మరియు ఆయన మహిమ ఫారాన్ కొండల్లో నుండి వచ్చింది" అని ఉంది.[34]

మహాప్రవక్త (స) 'ఖుబా'లో 'కుల్సూమ్ బిన్ బదమ్' - మరో ఉల్లేఖనంలో 'సఅద్ బిన్ ఖైస్మా' - ఇంట విడిది చేశారు- మొదటి ఉల్లేఖనమే సరి అయిందని ఆధారాలున్నాయి.

ఇటు హజ్రత్ అలి (ర) బిన్ అబీ తాలిబ్ మక్కాలో మూడు రోజులు ఉండి, మక్కావాసులకు సంబంధించిన ఏ అమానతులైతే దైవప్రవక్త (స) ఆయనకు అప్పగించివచ్చారో వాటన్నిటినీ వాటి యజమానులకు అప్పజెప్పి మదీనా దారిబట్టారు. ఆ తరువాత 'ఖుబా'లోనే ఆయన్ను (స) కలుసుకొని కుల్సూమ్ బిన్ బదమ్ ఇంట్లో విశ్రాంతి తీసుకున్నారు.[35]

దైవప్రవక్త (స) ఖుబాలో మొత్తం నాల్గు రోజులు[36] (అంటే సోమవారం, మంగళవారం, బుధవారం మరియు గురు వారం)లేదా పదికంటే ఎక్కువ

---

*33. సహీ బుఖారి-1/555* *34. బైబిల్-జుఖూఖ్ గ్రంథం-3,3*

*35. జాదుల్ ముఆద్-2/54; ఇబ్నె హష్షామ్-1/493; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/102*

*36. ఇది ఇబ్నె ఇస్హాక్ కథనం. చూడండి, ఇబ్నె హష్షామ్-1/494. దీన్నే అల్లామా*

https://teluguislam.net



రోజులు లేదా అక్కడకు చేరి బయలుదేరిన వరకు 24 రోజులు బస చేశారు. ఈ కాలంలోనే ఖుబా మస్జిద్ పునాదులు వేసి అందులో నమాజు చేశారు. ఇది దైవదౌత్యానికి సంబంధించిన ప్రప్రథమ మసీదు. దీని పునాదులు 'తక్వా' (దైవభీతి) పై పెట్టబడ్డాయి. అయిదవ రోజు (లేదా పన్నెండవ రోజు లేదా 26వ రోజు) శుక్రవారంనాడు- ఆయన(స) దైవాదేశం మేరకు వాహనమెక్కారు. అబూ బక్ర్ (ర) ఆయన వెనుక ఉన్నారు. ఆయన బనూ నజ్జార్‌కు- ఇది ఆయన (స) గారి మేనమామకు చెందిన తెగ - కబురు పంపించడం వలన వారంతా ఖడ్గధారులై అక్కడికి వచ్చి ఉన్నారు. ఆయన (వారి సంరక్షణలో) మదీనాకు బయలుదేరారు. బనూ సాలిమ్ బిన్ ఔఫ్ ఉండే ప్రదేశానికి చేరినప్పటికి జుమా నమాజు వేళ అయింది. మహాప్రవక్త (స) ఆ లోయ నడుమ, నేడు మస్జిద్ ఉన్న స్థలంలో నమాజు చేశారు. ఆయన వెనుక మొత్తం వంద మంది దాకా అప్పుడు ఉన్నారు.[37]

## మదీనాలో ప్రవేశం

జుమా నమాజు చేసిన తరువాత మహాప్రవక్త (స) మదీనా చేరారు. అదే రోజున ఆ నగరం పేరు 'యస్రిబ్'కు బదులు 'మదీనతుర్రసూల్'గా పడి పోయింది (అంటే ప్రవక్తగారి నగరం అని అర్థం). దీన్నే ఇప్పుడు కేవలం మదీనాగా మాత్రమే పిలువడం జరుగుతోంది. ఇది ఉజ్వలమైన చారిత్రాత్మక

*మన్సూర్‌పూరి కూడా అవలంబించారు. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/102. కాని సహీ బుఖారిలోని ఓ ఉల్లేఖనం ప్రకారం, దైవప్రవక్త (స) ఖుబాలో 24 రాత్రులు గడిపారని ఉంది (1/61). కాని మరో ఉల్లేఖనంలో పది రాత్రుల కంటే కొన్ని రోజులు అధికంగానే (1/555) మరియు మూడవ ఉల్లేఖనంలో పదునాల్గు రాత్రులు (1/560) గడిపారని ఉంది. ఇబ్నె ఖైమ్ ఈ చివరి ఉల్లేఖ నాన్నే అనుస రించారు. అయితే ఇబ్నె ఖైమ్ దీన్ని వివరిస్తూ, మహాప్రవక్త (స) సోమవారం నాడు ఖుబాకు చేరారని, అక్కడి నుండి శుక్రవారం నాడు బయలుదేరారని చెప్పారు (జాదుల్ ముఆద్-2/54,55). సోమవారం మరియు శుక్రవారాలను రెండు వేరు వేరు వారాలకు సంబంధించినవిగా తీసుకుంటే చేరిన తేది మరియు బయలుదేరిన రోజును వదిలేస్తే మొత్తం రోజుల సంఖ్య పది అవుతుంది. ఆ రెండు రోజులను కూడా కలుపుకుంటే ఆ సంఖ్య పన్నెండు రోజులు అవుతుంది. ఇలా మొత్తం రోజులు 14 ఎలా అవుతాయి?*

*37. సహీ బుఖారి-1/555,560; జాదుల్ ముఆద్-2/55; ఇబ్నె హష్షామ్-1/494; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/102*

https://teluguislam.net



మైన రోజు. నగరం వాడవాడల్లో, వీధుల్లో దైవ స్తోత్రాలు మిన్నుముడుతున్నాయి. అన్సార్‌కు చెందిన బాలికలు సంతోషాతిరేకంతో పాటలు పాడుతున్నారు. ఆ పాటల్లోని కొన్ని పంక్తులు ఇలా ఉన్నాయి:

"దక్షిణ దిశ కొండల్లో నుండి పున్నమి చంద్రుడు మాపై ఉదయించాడు.

ఆయన తెచ్చిన ధర్మం సత్యసందేశం ఎంత మేలైందో! దీనికి మనం అల్లాహ్‌కు కృతజ్ఞతలు చూపాలి.

నీకు విధేయత చూపటం మా విధి. నిన్ను నీ ప్రభువు మా కోసం పంపించాడు."[38]

అన్సార్‌లు (మదీనావారు) ఏమంత గొప్ప ధనికులు కూడా కాదు. అయినా దైవప్రవక్త (స) తమ వద్దనే ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకోనారంభించారు. మహాప్రవక్త (స) అన్సార్‌లకు చెందిన ఏ ఇంటి ముందునుంచైనా, ఏ వాడలో నుండి అయినా వెడుతూ ఉంటే ప్రజలు వచ్చి ఆయన స్వారీ చేస్తున్న ఒంటె ముక్కు త్రాటిని పట్టుకొని ఆపడానికి ప్రయత్నం చేస్తున్నారు. దైవప్రవక్త (స)ను తమ ఇంటికి వచ్చి దిగమని వేడుకుంటున్నారు. కాని మహాప్రవక్త (స) మాత్రం, "ఒంటె ముక్కు త్రాటిని వదిలేయండి. ఇది అల్లాహ్ ఆదేశాన్ని అనుసరించి నడుస్తోంది" అని చెప్పేవారు. ఇలా ఒంటె నడుస్తూనే ఉంది. ఈనాడు మస్జిదె నబవీ ఉన్న చోటికి వచ్చి కూర్చుండి పోయింది. అయినా మహాప్రవక్త (స) క్రిందికి దిగలేదు. ఆ ఒంటె తిరిగి లేచింది. కొంత దూరం వెళ్ళి తిరిగొచ్చి అదే స్థలంలో కూర్చుండిపోయింది. అప్పుడుగాని దైవప్రవక్త (స) క్రిందికి దిగలేదు. ఇది ప్రవక్త (స) అమ్మమ్మగారి తెగ బనూ నజ్జార్‌కు చెందిన వాడ. ఆయన మనోగతం కూడా అక్కడనే ఆగాలని ఉంది.

---

*38. ఈ పద్యపాదాలను అల్లామా మన్సూర్‌పూరి అనువదించారు. అల్లామా ఖైమ్ తన గ్రంథంలో ఈ పద్యపాదాలు తబూక్ యుద్ధానంతరం దైవప్రవక్త (స) మదీనాకు తిరిగివచ్చినప్పుడు చదువుబడిన పద్య పంక్తులు అని, మదీనా ప్రవేశమప్పుడు చదివినట్లుగా ఉల్లేఖించిన వ్యక్తి పొరబడ్డారని రాశారు (జాదుల్ ముఆద్-3/10). కాని అల్లామా ఖైమ్ మాత్రం పొరబడడానికి కావలసిన ఆధారాలు చూపెట్టలేకపోయారు. దీనికి భిన్నంగా అల్లామా మన్సూర్‌పూరి మాత్రం ఈ పద్యపాదాలు దైవప్రవక్త (స) మదీనాలో ప్రవేశించినప్పుడే చదవబడ్డాయని అంటారు. ఆయన కొట్టిపారవేయలేని ఆధారాలను కూడా చూయించారు. చూడండి, రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/106*

https://teluguislam.net



దానికి అల్లాహ్, ఆ ఒంటెను అక్కడే ఆగమని ఆదేశించాడు. బనూ నజ్జార్ తెగవారు ఆయన్ను (స) తమ తమ ఇండ్లకు గొనిపోవడానికి విన్నపాలు చేయనారంభించారు. కాని హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (ర) మాత్రం అంబారీతో సహా ఆయన్ను ఎత్తుకొని తన ఇంటిదారి పట్టారు. ఇటు హజ్రత్ అసఅద్ బిన్ జురారా (ర) వచ్చి దైవప్రవక్త (స) గారి ఒంటె ముక్కుతాడు పట్టుకొని తన ఇంటికి గొనిపోయారు. ఆ ఒంటె ఆయన దగ్గరనే ఉండి పోయింది.[39]

సహీ బుఖారిలో హజ్రత్ అనస్ (ర)గారి ఉల్లేఖనం ఇలా ఉంది.

దైవప్రవక్త (స), "ఇక్కడకు ఎవరి ఇల్లు దగ్గర్లో ఉంది?" అని అడగగా హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (ర), "నా ఇల్లు! దైవప్రవక్త (స)! అదిగో నా ఇల్లు. ఇదే దాని గుమ్మం" అని అన్నారు. మహాప్రవక్త (స) ఆయనతో, "వెళ్ళండి, వెళ్ళి సేద తీర్చుకోడానికి నా కోసం చోటును చూడండి" అని అన్నారు. హజ్రత్ అబూ అయ్యూబ్ (ర), "పదండి, మీరిద్దరూ పదండి. అల్లాహ్ శుభాలు చేకూరుస్తాడు" అని అన్నారు. [40]

కొన్ని రోజులు గడిచిన తరువాత ఆయన (స) సతీమణి ఉమ్ముల్ మోమినీన్ హజ్రత్ సౌదా (ర), ఆయన ఇద్దరు కుమార్తెలు హజ్రత్ ఫాతిమా (ర) మరియు ఉమ్మె కుల్సూమ్ (ర), హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర) మరియు ఉమ్మె అయిమన్ (ర)లు కూడా మదీనాకు విచ్చేశారు. వారందరిని హజ్రత్ అబ్దుల్లా బిన్ అబీ బక్ర్ (ర), అబూ బక్ర్ (ర) కుటుంబంతో సహా తోడ్కొని వచ్చారు. ఈ కుటుంబంలో హజ్రత్ ఆయిషా (ర) కూడా ఉన్నారు. అయితే మహా ప్రవక్త(స)గారి మరో పుత్రిక హజ్రత్ జైనబ్ (ర), హజ్రత్ అబుల్ ఆస్ (ర) గారి ఇంట్లోనే ఉండిపోయారు. ఆయన ఆమెను మదీనాకు రానివ్వకుండా నిలువరించి ఉంచారు. ఆమె బద్ర్ యుద్ధం తరువాతగాని మదీనా చేరలేక పోయారు.[41]

హజ్రత్ బిలాల్ (ర) గారికి కొంత స్వస్థత చేకూరినప్పుడు గొంతువిప్పి బాధాకరంగా కలువరిస్తూ, "మక్కా లోయలో నేను ఏ రాత్రి అయినా గడప గలనా? నా చుట్టూ ఇజ్ఖిర్ మరియు జలీల్ (గడ్డి) ఉంటాయా? ఏ రోజైనా

39. జాదుల్ మఆద్-2/55; రహ్మతుల్ లిల్ ఆలమీన్-1/106

40. సహీ బుఖారి-1/556

41. జాదుల్ మఆద్-2/55

https://teluguislam.net



నేను మజిన్నా చెలమ దగ్గరకు పోగలనా? నాకు షామా మరియు తుఫైల్ (కొండలు) కనిపిస్తాయా?" అంటూ తన బాధను వ్యక్తపరిచేవారు.

హజ్రత్ ఆయిషా (ర) మహాప్రవక్త (స) గారి సన్నిధికి వెళ్ళి బిలాల్ (ర) గారి ఈ పరిస్థితినే తెలుపగా ఆయన (స), "ఓ అల్లాహ్! మా దృష్టిలో ఈ మదీనాను మక్కా వలెనే ప్రియమైనదిగా చెయ్యి. దానికంటే మరింత ప్రియమైనదిగా చెయ్యి. ఈ మదీనా వాతావరణాన్ని మా కోసం ఆరోగ్యవంతమైనదిగా మలుచు. దీని 'సాఅ' మరియు 'ముద్' (ధాన్యం కొల పాత్రలను)లకు శుభాన్ని చేకూర్చు. ఇక్కడి ఉష్ణోగ్రతను తగ్గించి దాన్ని హుజ్ఫాకు తరలించు"[42] అని ప్రార్థించారు. అల్లాహ్ దైవప్రవక్త (స) గారి ప్రార్థనను మన్నించాడు. పరిస్థితులు మారిపోయాయి.

ఇక్కడి వరకు పవిత్ర జీవిత చరిత్రకు సంబంధించిన ఓ దశ మరియు ఇస్లామీయ సందేశ ప్రచారానికి సంబంధించిన ఓ శకం (అంటే మక్కా జీవిత కాల శకం) పూర్తి అయింది.

---

42. సహీ బుఖారి-1/588,589

https://teluguislam.net



